క్లుప్తంగా

నేడు అక్షయ తృతీయ పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైశాఖ శుద్ధ తదియ పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అక్షయ తృతీయ విశేష పూజలు నిర్వహించనున్నారు. స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఉదయం రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగ స్వామి వారికి విశేష చందన అలంకరణ, అనంతరం సుదర్శన హోమం, నారాయణ హోమం నిర్వహిస్తారు. ప్రత్యేక అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు చేశారు. సత్రం పాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు శ్రీచక్రాభిషేకం, అనంతరం లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన, ఉదయం 8 గంటలకు లక్ష్మీ కుబేర హోమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు రాహుకాల కుంకుమార్చన చేస్తారు. దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో ఉదయం 10 గంటలకు భక్తులచే సామూహిక లక్ష్మీ కుబేర వ్రత నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఆళ్ల నానికి ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ మద్దతు


ఆళ్ల నానిని కలిసి మద్దతు చెబుతున్న ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమాజంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరుతుందని, ప్రజలందరి అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగనన్నకు క్రైస్తవులంతా అండగా ఉంటారని ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు తెలిపారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారంతా ఎమ్మెల్యేను కలిసి విజయానికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులు విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు నాగిశెట్టి డానియేల్, గుడిసేవ ప్రదీప్, గుంటూరు చంటిబాబు, శీరం సుందర్‌సింగ్, కావూరి సతీష్ తదితరులు ఉన్నారు.


ఆళ్ల నానికి మద్దతు తెలుపుతున్న ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు

రాష్ట్రానికి చంద్రబాబు చేసింది శూన్యం

- మోసపు హామీలను ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: చంద్రబాబుకు అనుభవం ఉందని, 40 ఇయర్స్ ఇండస్ట్రీ కదా అని, రాష్ట్ర ప్రజలు 2014లో టీడీపీకి అధికారం ఇస్తే, రూ.2.64 లక్షల కోట్లు అప్పులు చేసి జేబులు నింపుకోవటం తప్ప, రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు చేసింది ఏమీ లేదని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు నగరంలోని 47, 48, 49, 50 డివిజన్లకు సంబంధించి గురువారం రాత్రి తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో నాని మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలు, రైతన్నలకు రుణమాఫీ చేస్తానని చెప్పి ఘోరంగా మోసం చేయటాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని 98 శాతం నెరవేర్చారని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. తన హయాంలో ఏలూరు నియోజకవర్గంలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, గొడవలు, రౌడీయిజం లేవని, బెల్టు షాపులన్నీ మూయించేశామని, ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే ఏలూరు నగరంలో అరాచకం పెచ్చుమీరుతుందని, ప్రతి వీధిలోనూ దౌర్జన్యాలు పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

స్వేచ్ఛగా ఓటేయండి

మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు మళ్లీ పక్కాగా అమలు కావాలన్నా, కుటుంబాలన్నీ సంతోషంగా జీవించాలన్నా, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌లకు విజయాన్ని అందించాలని అన్నారు. విలువైన ఓట్లను ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. సీఎం జగనన్న చేసిన మంచిని గుర్తు చేసుకోవాలని కోరారు. తొలుత నానికి మేయర్ షేక్ నూర్జహాన్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, దేవరకొండ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏలూరు కోఆప్షన్ సభ్యుడు మున్నల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆయనకు భారీ గజమాలలు, పూల వర్షంతో ఆహ్వానం పలికారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నాయకులు నెరుసు గోకుల్, నున్నా బ్రదర్స్, పల్లా రమేష్, మానుకొండ శ్రీను, మహ్మద్ ఖాజీ, నాయుడు తదితరులు ఉన్నారు.


తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని చిత్రంలో మేయర్ నూర్జహాన్


ప్రచార సభకు హాజరైన ప్రజలు


ప్రచారంలో పార్టీ జెండాలతో అభిమానులు

శ్రీవారి వైశాఖ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


శ్రీవారి ఆలయంలో వైశాఖ బ్రహ్మోత్సవ ప్రారంభ పూజలు చేస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 35వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఉదయం శ్రీమత్ విష్వక్సేన పూజ, భగవత్పుణ్యాహవాచనం, ఉదయం 10 గంటలకు అశ్వ వాహనంపై శ్రీవారిని పెండ్లి కుమారుని చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి శ్రీమద్విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షా ధారణ, ఋత్విక్వరుణం, మత్సంగ్రహణం, అంకురార్పణ, వైనతేయపట అదివాసం చేసి అనంతరం తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి

దెందులూరు: కొత్తూరులో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు ఈవీఎం, వీవీప్యాడ్ మిషన్ల నమూనాలతో ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ మాజీ చైర్మన్ డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జి), ఐటీ విభాగం జిల్లా చైర్మన్ గూడపాటి పవన్ కుమార్, ఎంపీటీసీ సున్నా నరేష్, పార్టీ మండల అధ్యక్షులు తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, బుద్ధా అర్జున, నాయకులు డీవీఆర్‌కే చౌదరి, సురేష్, బీశెట్టి నూకరాజు, కార్యకర్తలు ఉన్నారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో గురువారం వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలబాలికలు పాల్గొన్నా రు. చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరులో సర్కారీ వైద్యవిద్య

- శరవేగంగా భవనాల నిర్మాణం
- రూ.90 కోట్లతో మెడికల్ కాలేజీ ప్రధాన భవనం
- రూ.16 కోట్లతో బాలురు, బాలికలకు హాస్టల్స్ భవనాలు
- మరో రెండేళ్లలో రూపురేఖలు సమూలంగా మార్పు

ఏలూరు టౌన్: సర్కారీ వైద్య విద్య నేడు అందుబాటులోకి వచ్చింది. మెడిసిన్ చదివేందుకు గతంలో విదేశాలకు వెళ్లాల్సి వచ్చేది. వైద్య విద్య సామాన్య, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు అందని ద్రాక్షలా ఉండేది. కాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన 58 నెలల కాలంలో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు. రాష్ట్రంలో చరిత్ర సృష్టిస్తూ ఏకంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రంగం సిద్ధం చేయగా, ఏలూరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో శంకుస్థాపన చేయగా, 2023 సెప్టెంబర్ 2వ తేదీన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఇది చరిత్రలో నిలిచిపోయే అంశంగా ఏలూరు ప్రజలు భావిస్తున్నారు.

3 లక్షల చదరపు అడుగుల్లో..

ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రధాన భవన నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. సుమారుగా రూ.90 కోట్ల వ్యయంతో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఏలూరు నగరానికే వెన్నె తెచ్చేలా.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా ప్రత్యేక డిజైన్‌తో భవన నిర్మాణం చేపట్టారు. ఈ భవనంలోనే ఎంబీబీఎస్ విద్యార్థులకు అత్యాధునిక డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగం వంటివి ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం మెడికల్ విద్యార్థులకు ఏలూరు పాతబస్టాండ్ సెంటర్ సమీపంలో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద జీప్లస్ 2 భవనాన్ని నిర్మించారు. రూ.60 కోట్ల వ్యయంతో సుమారుగా ఒక లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం ఏర్పాటు చేశారు.

రూ.16 కోట్లతో హాస్టల్ భవనాలు

ఏలూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించి ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు బాలురు, బాలికలకు వేర్వేరుగా చేపట్టిన హాస్టల్ భవనాల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. ఎంసీహెచ్ బ్లాక్ వెనుక వైపు ఈ భవనాల నిర్మాణం పూర్తికావచ్చింది. బాలికలకు జీప్లస్ 6 అంతస్తులతో హాస్టల్ భవనాన్ని రూ.9 కోట్ల నిధులతో నిర్మిస్తున్నారు. అదే ప్రాంతంలో బాలురకు జీప్లస్ 5 అంతస్తులతో రూ.7 కోట్లతో హాస్టల్ నిర్మిస్తున్నారు. బాలికలకు సుమారు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, బాలురకు సుమారుగా 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టల్ భవనాల నిర్మాణం చేపట్టారు. రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, బోధనాసుపత్రి, ప్రొఫెసర్లు, టీచింగ్‌స్టాఫ్, నర్సింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.


ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ ప్రధాన భవనం


మెడికల్ కాలేజీ భవనం నమూనా


నిర్మాణంలో ఉన్న జీప్లస్ 6 అంతస్తుల బాలికల హాస్టల్ భవనం


నిర్మాణంలో ఉన్న జీప్లస్ 5 అంతస్తుల బాలుర హాస్టల్ భవనం

మెరుగైన వైద్యసేవలు



ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల రావడంతో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. జిల్లా ప్రజలంతా అనేక ఏళ్లుగా ఎదురుచూడగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాకారమైంది. ప్రభుత్వ బోధనాసుపత్రి నిర్మాణంతో నాణ్యమైన వైద్యం, నిపుణులైన వైద్యులు, ఆధునిక వైద్య యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

– తోట పండు, ఏలూరు టూటౌన్

వైద్య విద్య చేరువ చేశారు



విదేశాలకెళ్లి కోట్లు ఖర్చు పెట్టి వైద్య విద్యను చదవాల్సిన పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కళాశాలలు రావడంతో విద్యార్థులకు మెడిసిన్ చదువుకునే అవకాశం దక్కుతుంది. నీట్ పరీక్షలో మెరుగైన ర్యాంకు సాధిస్తే మన రాష్ట్రంలోనే మెడిసిన్ చదువుకునే అవకాశం ఉంటుంది. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో చేసిన మంచి పని. దీన్ని ప్రతి ఒక్కరూ సమర్థించాలి.

– ఎండీ గాలబ్ అలీ, ఏలూరు వన్‌టౌన్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	94
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	04-06
బెండకాయలు	32	కంద	72
పచ్చిమిర్చి	68	బీట్‌రూట్	38
కాకర కాయలు	34	కీరా దోస	36
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	180
బీరకాయలు (పందిరి)	54	అల్లం	160
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	36-48	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	28	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	22	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు -బీహెచ్ఈఎల్	20.15	4802	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

2,431 మంది ఓటు హక్కు వినియోగం

దెందులూరు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ గురువారం 75 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో 75 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, నాలుగు రోజులుగా 2,431 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ బీ లావణ్యవేణి అన్నారు.

కష్టపడిన వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు

నిడమర్రు: టీడీపీ కండువాతో 2014 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం కష్టపడినా ఐదేళ్లలో పార్టీలో కనీస గుర్తింపు లేకపోవడంతోపాటు విసిగిపోయి, తన వర్గంతో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలోకి చేరానని బువ్వనపల్లికి చెందిన సంకు నాగేషు అన్నారు. సేవలు గుర్తించి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా అవకాశం కల్పించారని, వైఎస్సార్ సీపీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపునకు వస్తుందనడానికి ఇదే నిదర్శనమని ఆయన అన్నారు. నాడు టీడీపీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు రూ.5వేలకు కూడా కక్కుర్తి పడిన సందర్భాలున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిడమర్రు వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి ఓటమి చెందడంతో ఆ పదవి కోసం మరో ఎంపీటీసీ సభ్యుడు రూ.50 లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడితే నష్టపోయిన ఎంపీపీ అభ్యర్థికి ఆ రూ.50 లక్షలు వెళ్లి ఇవ్వమని వాసుబాబు ఆయనతో అన్నారని ఇది ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని నాగేషు తెలిపారు. మంచితానికి, నిజాయతీకే పట్టం కట్టేందుకు ఉంగుటూరు ఓటర్లంతా సిద్ధంగా ఉన్నారని, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన వాసుబాబు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


1వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మైబాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే ఆళ్ల నానిని గెలిపించాలని ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ క్లస్టర్-3 అధ్యక్షుడు మంచెం మైబాబు కోరారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 1వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, పార్టీ నాయకులు ఆరేపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ విజయానికి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోరాడ బాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

కొఠారు అబ్బయ్యచౌదరికి ఎంఆర్‌పీఎస్ మద్దతు

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గంలో ఎంఆర్‌పీఎస్ శ్రేణులు గురువారం మద్దతు పలికారు. పెదవేగి మండలం అంకన్నగూడెం, కొప్పాక, పెదపాడు మండలం కొక్కిరపాడు, వేంపాడు, వట్లూరు, శౌరీపురం గ్రామాల్లో మాదిగలు కొఠారుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు ఫ్యాన్ గుర్తుపై వేసి విజయం అందిస్తామన్నారు. ఎంఆర్‌పీఎస్ భవిష్యత్తు, వైఎస్సార్‌సీపీతోనే ముడిపడి ఉందని పెదపాడు మండల యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కిరణ్‌బాబు అన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ కళాశాల దినోత్సవం

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాల గురువారం కాలేజీ డే ఘనంగా నిర్వహించారు. గురువారం పెదవేగి మండల దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఖమ్మం పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ సగిలి ప్రకాష్ పాల్గొనగా, ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 2023 -24 సంవత్సరపు కళాశాల రిపోర్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిని వివరించి అధ్యాపకులు, కరస్పాండెంట్, ప్రిన్సిపల్‌ని అభినందించారు. క్రీడల్లో, చదువులో ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్, ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి బాల, ట్రస్ట్ మెంబర్లు, ఫాదర్లు, మైకేల్, ఇమ్మానియేల్, రాజు ఏలూరు పీఠంలోని ఫాదర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ డాక్టర్ అరుణ్ పాల్గొన్నారు.